

## తియ్యని మధురఫలాల గంగమ్మ

### -మూడవ మంగళవారం దర్శనం

తిరుపతి, జూన్ 6ప్రభాతవార్త:

తిరుపతి నగరగ్రామదేవత తాతయ్యగుంట గంగమ్మను మంగళవారం ఆలయ వర్గాలు పలురకాల మధురఫలాలతో అలంకరించారు. గంగమ్మజాతర ముగిసిన మూడవ మంగళవారం కావడంతో ఉదయం సుప్రభాతంతో అమ్మవారిని మేల్కొలిపి ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. అనంతరం అమ్మవారిని పూర్తిగా పలు రకాల పండ్లతో అలంకరించారు . ఉదయం 8 నుంచి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ ఇఒ మునికృష్ణయ్య, అర్చకులు భక్తులకు అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు. తిరుపతి వాసులనేగాక రాష్ట్రంలోని ప్రజలను కాపాడాలని, సకాలంలో వర్షాలుకురిపించాలని వేడుకున్నారు.




## వెంకన్న సుప్రభాతసేవలో ఆదిపురుష్

తిరుమల, జూన్ 6ప్రభాతవార్త్రప్రతినిధి:



ఆదిపురుష్ చిత్రం ఈనెల 16వతేదీ ప్రపంచవ్యాప్తంగా విడుదలకానుందని దర్శకుడు ఓంరౌత్, నటుడు ప్రభాస్ తెలిపారు. ఆదిపురుష్ ప్రీరిలీజ్ ఈవెంట్‌లో పాల్గొనేందుకు చిత్ర బృందం మంగళవారం వేకువజామున వెంకన్న సుప్రభాతసేవలో పాల్గొని ఆశీస్సు లందుకున్నారు.



## ఘనంగా శ్రీవరదరాజస్వామి రథోత్సవం

కుప్పంరూరల్, జూన్ 6 ప్రభాతవార్త

కుప్పం మున్సిపల్ పరిధి లక్ష్మీపురంలో వెలసిన శ్రీ ప్రసన్న వరదరాజస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారి రథోత్సవంను కన్నులపండువగా నిర్వహించారు. స్వామివారిని ప్రత్యేకంగా అల ంకరించి రథంపై ఊరేగించారు. భక్తులు గోవిందనామ స్మరణ చేస్తూ రథాన్ని లాగారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# సూర్యప్రభ, చంద్రప్రభ వాహనాలపై శ్రీనివాసుడు విహారం





వడమాలపేట, జూన్ 6 ప్రభాతవార్త: అప్పలాయగుంటలో వెలసిన శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామివారి వార్షికోత్సవాల్లో భాగంగా మంగళవారం శ్రీనివాసుడు ఉదయం సూర్యప్రభ వాహనం, రాత్రి చంద్రప్రభ వాహనాలపై విహరించారు. ఉదయం 7.30 గంటలకు వాహన మండపం చేరుకున్న స్వామివారు సర్వాలంకార భూషితుడై సూర్యప్రభ వాహనాన్ని అధిరోహించి మాడవీధుల్లో విహరించారు. 9 గంటలకు తిరిగి వాహన మండపం చేరుకున్న అనంతరం ఉభయ దేవేరులతోపాటు స్వామివారికి స్నపన తిరుమం జనం నిర్వహించారు. సాయంత్రం ఊంజల్‌సేవలో పద్మావతీ ఆండాళ్ సమేతంగా శ్రీవారు ఉయలలో కొలువుదీరి భక్తులకు కనువిందు చేశారు. 7 గంటలకు చంద్రప్రభ వాహనాన్ని అధిరోహించిన శ్రీవారు పురవీధుల్లో విహరించారు. ఈ కార్యక్రమాల్లో సూపరింటెండెంట్ శ్రీవాణి, ఆలయ అధికారి శివకుమార్, ఆలయ ప్రధాన అర్చకులు సూర్య కుమారాచార్యులు, రమణాచార్యులు, స్థానిక సర్పంచ్ శేషాద్రిరెడ్డి, వేదపండితులు, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.












## వ్యవసాయ విద్యలో సమూల మార్పులు

### ముగిసిన పోషకాహార భద్రతపై జాతీయ సదస్సు



తిరుపతిరూరల్, జూన్ 6 ప్రభాతవార్త:

శ్రీవేంకటేశ్వర వ్యవసాయ కళాశాల ఆధ్వర్యంలో రెండురోజులు పాటు జరిగిన "వ్యవసాయ పరిశోధన - పోషకాహార భద్రత" జాతీయ సదస్సు మంగళవారం ముగిసింది. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విద్యాలయ ఉప కులపతి డాక్టర్ ఆదాల విష్ణువర్ధన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ముగింపు సమావేశానికి భారత వ్యవసాయ పరిశోధన మండలి అడిషనల్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సీమ జగ్గి ముఖ్యఅతిధిగా హాజరై, విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఇలాంటి సదస్సులను జాతీయ స్థాయిలో అన్ని విశ్వవిద్యాలయాల్లో నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సదస్సు ముఖ్యంగా విద్యార్థులలో పరిశోధనల పట్ల అవగాహనతో పాటు వివిధ విద్యార్థులతో పరస్పర విజ్ఞాన మార్పిడికి, సమాచార మార్పిడికి, విద్యార్థులలో నైపుణ్యాన్ని పెంపొందించుటకు దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు. ఆచార్య ఎన్జీ రంగ వర్సిటీ ఉప కులపతి డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ వర్సిటీ ఆధ్వర్యంలో పి.జి దశలో పరిశోధనల నాణ్యత పెంపొందించుటకు అనేక జాతీయ, అంతర్జాతీయ పరిశోధనలతో కలిసి పని చేస్తున్నామని తెలిపారు. వర్సిటీ డీన్ డాక్టర్ గుత్తా రామారావు మాట్లాడుతూ రెండురోజుల పాటు జరిగిన జాతీయ సదస్సు ద్వారా దేశం నలుమూలల నుంచి 570 మంది పి.జి విద్యార్థులు హాజరై విజయవంతం చేసారని తెలిపారు. ఈ సదస్సులో పరిశోధన విద్యార్థులు ఆహార భద్రత-పోషకాహారం కొరకు వివిధ పంటల్లో నూతన రకాల రూపకల్పన, ఆధునిక సాగు పద్ధతులు, పంటల ఆరోగ్య సంరక్షణలో వినూత్న మెలకువులు, వాతావరణ మార్పులపై పరిశోధన, వాతావరణ ఆధారిత సాంకేతిక పరిజ్ఞానం పెంపు, వ్యవసాయ యాంత్రీకరణ, ఉద్యాన పంట సాగులో నూతన సాంకేతికత అభివృద్ధి, పశుపోషణలో మెలకువులు, రైతులు సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకోవడం ఎదురైతున్న సవాళ్ళు అనే అంశాలపై చర్చాగోష్ఠులు నిర్వహించి, ఉత్తమ పరిశోధనాంశాలకు బహుమతులు, ప్రసంశాపత్రాలు అందజేసారు. ఈ సమావేశంలో వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి, ఏడిఆర్ డాక్టర్ రమణ, డాక్టర్ సత్యగోపాల్ తదితరులు పాల్గొన్నారు.












## జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

### - జిల్లా కలెక్టర్ సగిలి షన్మోహన్

కుప్పం, జూన్ 6 ప్రభాతవార్త

గ్రామాల్లో నిర్మిస్తున్న జగనన్న కాలనీల్లో లబ్దిదారులు గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ సగిలి షన్మోహన్ ఆదేశించారు. మంగళవారం కుప్పం నియోజకవర్గంలో కలెక్టర్ సగిలి షన్మోహన్ సుడిగాలి పర్యటన నిర్వహించారు. కుప్పం మండలం నూలుకుంట, గుడుపల్లె, రామకుప్పం మండలం మణీంద్రం గ్రామాల్లో గృహ నిర్మాణాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈసందర్భంగా లబ్దిదారులతో నేరుగా మాట్లాడారు. ప్రభుత్వం గృహ నిర్మాణాలకు సంబంధించి బిల్లులను వేగవంతంగా అందిస్తోందన్నారు. ప్రతి పక్కా ఇంటికి 1.80లక్షల మేర నిధులు కేటాయిస్తోందన్నారు. సిమెంట్, స్టీల్, తలుపులు తదితరాలను హౌసింగ్ శాఖ ద్వారా అందించడం జరుగుతోందన్నారు. లబ్దిదారులు కూడా సకాలంలో గృహ నిర్మాణాలు పూర్తి చేయాలని సూచించారు. అనంతరం లబ్దిదారులు నిర్మిస్తున్న గృహాలను పరిశీలించారు. అ ంతకుముందు జిల్లా కలెక్టర్ కుప్పంలోని సెంటర్ ఫర్ ఎక్స్‌లెన్స్‌ను సందర్శించారు. కార్యక్రమాల్లో ఎంపిడిఒ జానకమ్మ, హార్టీకల్చర్ అధికారిణి డింపుప్రియశ్రీ, ఎంఇఒ మహబూబ్ బాషా, గుడుపల్లె ఎంపిపి వరలక్ష్మి గోపి, జడ్పీటిసి కృష్ణమూర్తి, సర్పంచ్ కుమారస్వామి, ఎపిఎం శ్రీనివాసమూర్తి, వైద్యాధికారులు డా॥ సుభాష్‌రాజా, డా॥ అనూష తదితరులు పాల్గొన్నారు.











## భూవివాదంలో వ్యక్తి దారుణహత్య



వి.కోట, జూన్ 6 ప్రభాతవార్త

మండలంలోని చింతమాకులపల్లి పంచాయతీ కె. గొల్లపల్లికి చెందిన సుదర్శన్ (25) భూతగాదాల నేపథ్యంలో దారుణహత్యకు గురయ్యాడు. గ్రామానికి చెందిన చంద్రశేఖర్, కృష్ణప్పలు అన్నదమ్ములు. వీరికి వారసత్వంగా వచ్చిన మూడెకరాల పొలాన్ని సమానంగా పంచుకుని సాగు చేస్తున్నారు. ఇటీవల జరిగిన రీసర్వేలో భాగంగా 30 సెంట్ల స్థలం తమ పేరిట ఉందని దాన్ని తమకు అప్పగించాలని చంద్రశేఖర్ కుమారుడు సుదర్శన్ కృష్ణప్ప, బాలాజీలను కోరాడు. అందుకు వారు అంగీకరించలేదు. గ్రామంలో పంచాయతీ సైతం చేయాలని నిర్ణయించారు. అయితే తమ పొలంలో ఉన్న చెట్లకు సుదర్శన్ మందు కొట్టడంతో అవి ఎండాయని భావించిన బాలాజీ సుదర్శన్‌పై కత్తితో దాడి చేసి హతమార్చాడు. విషయం తెలుసుకున్న సిఐ ప్రసాద్ బాబు గ్రామానికి చేరుకుని విచారించారు. మృతదేహాన్ని పలమనేరుకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మామిడి మద్దతు ధర రూ.15.50

### - కలెక్టర్ సగిలి షన్మోహన్

చిత్తూరు, జూన్ 6 ప్రభాతవార్త: జిల్లాలో జూన్ 11వ తేదీ వరకు మామిడి మద్దతు ధర కేజీ రూ.15.50గా కలెక్టర్ సగిలి షన్మోహన్ ఖరారు చేశారు. కలెక్టరేట్‌లోని సమావేశభవనంలో మంగళవారం కలెక్టర్ సగిలి షన్మోహన్ మామిడి రైతులు, ప్రాసెసింగ్ యూనిట్ల యాజమా నులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ మామిడి పంట విషయంలో రైతులు, కొనుగోలుదారులు ఇద్దరికి మధ్యస్థంగా వుండేవిధంగా మామిడికి మద్దతు ధర ప్రకటించడం జరుగుతున్నదన్నారు.










## అద్దె బకాయిదారులకు నోటీసులు

**చిత్తూరు, జూన్ 6 ప్రభాతవార్త:**



మున్సిపల్ కార్పొరేషన్ దుకాణాలకు దీర్ఘకాలికంగా అద్దె చెల్లించకుండా బకాయి పడ్డ యాజమానులకు మున్సిపల్ కమీషనర్ డాక్టర్ జె.అరుణ మంగళవారం నోటీసులు జారీ చేశారు. కమీషనర్ డాక్టర్ జె.అరుణ ఎంఎస్ఆర్ మున్సిపల్ కాంప్లెక్‌లోని దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కమీషనర్ డాక్టర్ జె.అరుణ మాట్లాడుతూ అద్దె చెల్లించని దుకాణదారులు సత్వరం బకాయిలు చెల్లించాలని ఆదేశించారు. మూసి వున్న దుకాణాలకు నోటీసులను సదరు దుకాణాల డోర్లకు అతికించారు. బకాయిలను వారం రోజుల్లోపు చెల్లించాని నోటీసుల్లో స్పష్టం చేశారు. బకాయిలు చెల్లించని దుకాణాలను స్వాధీనం చేసుకొని చట్ట ప్రకారం తదుపరి చర్యలు తీసుకొంటామని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమీషనర్ గోవర్ధన్, ఆర్ఓ గోపాలకృష్ణవర్మ, సీనియర్ అసిస్టెంట్ తనూజ, ఆర్ఐలు, అడ్మిన్ కార్యదర్శులు పాల్గొన్నారు.

## గ్రీన్ ప్యానెల్ కంపెనీ ద్వారా ఈఏడాది 2కోట్ల మొక్కల పంపిణీ

**తొట్టంబేడు, జూన్ 6 ప్రభాతవార్త**



మండలంలోని రౌతుసూరమాల పంచా యతీలో ఉన్న గ్రీన్ ప్యానెల్ కంపెనీ ద్వారా ఈఏడాది 2కోట్లు జామాయిల్, తైలం మొక్కలను ఉచితంగాను, సబ్సిడీలోను పంపిణీచేస్తున్నామని యాజమాన్యం ఓ ప్రకటలో తెలిపింది. ఈసందర్భంగా గ్రీన్ ప్యానెల్ ప్రతినిధి మాట్లాడుతూ తిరుపతి జిల్లా చుట్టుపక్కల గ్రామ ప్రజలందరికీ గ్రీన్ ప్యానెల్ యాజమాన్యం యొక్క టెక్నికల్ పరిజ్ఞానంతో బీడు, బంజరు, ఇసుక మరియు ఎర్రనేలల్లో సునాయాసంగా పెరిగే క్లోనింగ్ పద్ధతి ద్వారా ఉత్పత్తి చేసిన కాండం నిటారుగా ప్రక్క కొమ్మ లేకుండా అతి తక్కువ పెట్టుబడితో ఎక్కువ కలప దిగుబడినిచ్చే నీలగిరి మొక్కలను కంపెనీ నుంచి ఐదు కి.మీ పరిధి దాటిన రైతులు అందరికీ ఉచితంగా అందిస్తోందని, కంపెనీ నుంచి 100కి.మీ పరిధిలో ఉన్న గ్రీన్ ప్యానెల్ యాజమాన్యం మద్దతుతో ఖాళీగా ఉన్న బీడు భూములను సాగులోకి తీసుకురావడం ద్వారా కుటుంబం వలసలను తగ్గించడంలో ఫారం ఫారెస్ట్రీ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ఈ ప్రయత్నం పేద మరియు సన్న కారు రైతులను ఆర్థికంగా అభివృద్ధి చేయడానికి సహాపడుతుందన్నారు. మరిన్ని మెరుగైన సేవలను రైతులకు అందించేందుకు కంపెనీ ఒక ప్రత్యేక శాఖ ఏర్పాటుచేసి అర్హత సాధించిన సిబ్బందిని నియమించి వారి ద్వారా రైతులందరికీ సకాలంలో క్లోనింగ్ పద్ధతి ద్వారా ఉత్పత్తి చేసిన జామాయిల్/తైలం మొక్కలను అందిస్తూ వారి ఆర్థిక అభివృద్ధికి పునాదులు వేస్తుందన్నారు. మొక్కలు పంపిణీచేయడం ఓ సామాజిక బాధ్యత కింద అమలు చేస్తున్నామన్నారు. రైతులందరు మెరుగైన సేవలు పొందుటకు 9100888676, 8700493301కు ఫోన్‌చేసి పూర్తి వివరాలు తెలుసుకోవచ్చన్నారు.

## పారిశుద్ధ్య పనులు మెరుగ్గా చేపట్టండి

కమిషనర్ హరిత

**తిరుపతి కార్పొరేషన్, జూన్ 6, ప్రభాతవార్త**



నగరంలో పారిశుద్ధ్య పనులు మెరుగ్గా ఉండేలా చర్యలు చేపట్టాలని నగర పాలక సంస్థ కమిషనర్ హరిత పారిశుద్ధ్య అధికారులను ఆదేశించారు. విష్ణు నివాసం పక్కన గల రోడ్డులో మురుగునీరు వస్తుండడం చూసి పారిశుద్ధ్య సిబ్బంది పై ఆగ్రహం వ్యక్తం చేసారు. విష్ణు నివాసం పక్కన ఉన్నటువంటి తోపుడు బండ్లు నిర్వహించే వారు, షాపుల వాళ్ళు కాలువల్లో చెత్త వేస్తున్నారని సిబ్బంది చెప్పడంతో, కమిషనర్ హరిత స్పందిస్తూ పారిశుద్ధ్య అధికారులు, సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేసి కాలువల్లో, బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేసిన వారిని గుర్తించి జరిమానాలు విధించాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రతి వార్డుల్లో పర్యటించి డ్రైన్ శుభ్రంగా ఉండేలా చేత్త తీయించాలన్నారు. నిరంతరం శుభ్రత గురించి ప్రజలకు అవగాహన కలిస్తూ, తిరుపతి పుణ్య క్షేత్రాన్ని పరిశుభ్రత నగరంగా నిలిపేందుకు అందరం సమిష్టిగా కృషి చేద్దామన్నారు. కమిషనర్ వెంట మున్సిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్, పారిశుద్ధ్య అధికారులు, సిబ్బంది ఉన్నారు.

## శాంతిపురం తహశీల్దార్‌గా కౌలేష్ నియామకం

**శాంతిపురం, జూన్ 6 ప్రభాతవార్త**



శాంతిపురం మండల తహశీల్దార్‌గా కౌలేష్‌ను నియమిస్తూ జిల్లా కలెక్టర్ సగిలి షన్మోహన్ ఆదేశాలు జారీ చేశారు. ఈయన ప్రస్తుతం శాంతిపురంలో ఉప తహశీల్దార్‌గా పనిచేస్తున్నారు. తహశీల్దార్ లోకేశ్వరరావును పెద్దపంజాణికి బదిలీ చేశారు. కాగా గత పదిహేను రోజులుగా తహశీల్దార్ లోకేశ్వరరావు సెలవులో ఉన్నారు.

## పక్కాగా సమస్యలు పరిష్కారం

**పాలసముద్రం, జూన్ 6 ప్రభాతవార్త:**

గ్రామ సచివాలయాలకు సమస్యలపై వచ్చే ప్రజలకు పక్కాగా సేవలు అందించాలని ఎంపిడిఓ శ్రీనివాసులు పేర్కొన్నారు. వనదుర్గాపురం గ్రామ సచివాలయంను మంగళవారం ఎంపిడిఓ శ్రీనివాసులు తనిఖీ చేసి సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. సిబ్బంది విధులపై పక్కాగా అవగాహన కల్గి వుండాలని, ఎదైనా క్లిష్టమైన సమస్య వస్తే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఇళ్ళ నిర్మాణాలను మరింత వేగవంతం చేయాలని ఇంజనీరింగ్ అసిస్టెంట్ జయరాజును ఆదేశించారు.

## తహసిల్దారు బదిలీ

**పాలసముద్రం, జూన్ 6 ప్రభాతవార్త:**

పాలసముత్రం తహసిల్దారు బాబును గంగాధరనెల్లూరు తహసిల్దారుగా బదిలీ చేస్తూ కలెక్టర్ సగిలి షన్మోహన్ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే జిడినెల్లూరు తహసిల్దారు ఇన్బనాధన్‌ను పాలసముద్రం తహసిల్దారుగా బదిలీ అయ్యారు. తహసిల్దారు బాబు గత ఏడాది కాలంగా మండలంలో ఇసుక అక్రమ రవాణా, భూములు ఆక్రమణకు గురి కాకుండా గట్టి చర్యలు తీసుకొన్నారు.

## ఉపాధ్యాయ బదిలీల్లో అన్ని ఖాళీలు ప్రదర్శన

– ఫ్యాప్టో డిమాండ్

**చిత్తూరు, జూన్ 6 ప్రభాతవార్త:**



ఉపాధ్యాయ బదిలీ కౌన్సెలింగ్‌లో అన్ని ఖాళీలను పారదర్శకంగా ప్రదర్శించాలని ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య రాష్ట్ర డిప్యూటీ సెక్రటరీ జనరల్ చిరంజీవి డిమాండ్ చేశారు. చిత్తూరు ఎన్జీఓ భవన్‌లో మంగళవారం ఫ్యాప్టో కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిధిగా హాజరైన చిరంజీవి మాట్లాడుతూ టీచర్ల బదిలీల ప్రక్రియ ఒక ప్రహసనంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. సీనియర్ టీచర్లకు సైతం బదిలీల్లో సరైన స్థానాలు లభించని దుస్థితి ఏర్పడిందన్నారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో స్టీరింగ్ కమిటీ సభ్యులు మునాఫ్, రమేష్, దేవరాజులురెడ్డి, రమణ, కిరణ్, నాదముని, రామచంద్రయ్య, గంటామోహన్, చెంగ్రాయమందడి, ఆంజనేయులు, మదన్‌మోహన్‌రెడ్డి, కుమార్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## కాణిపాకం దేవస్థానం పంచాగకర్తగా శివకుమార్ శర్మ నియామకం

**కాణిపాకం, జూన్ 6 ప్రభాతవార్త:**



సత్య ప్రమాణాలకు నెలవైన కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానం పంచాంగకర్తగా ఎ.శివకుమార్ వర్మను నియమిస్తూ రాష్ట్ర దేవాదాయశాఖ కమీషనర్ మంగళవారం ఉత్వర్వులు జారీ చేసింది. అన్నమయ్య జిల్లా మదనపల్లెకు చెందిన ఎ.శివకుమార్ శర్మను పంచాంగకర్తగా నియమిస్తూ నియామక ఉత్వర్వులను దేవస్థానం ఈఓ ఎ.వెంకటేశు మంగళవారం అందజేశారు. ఈమేరకు శివకుమార్ దంపతులు ఆలయంలో స్వామివారికి ప్రత్యేకపూజలు నిర్వహించిన అనంతరం నియామక ఉత్వర్వులను అందుకున్నారు.

## నేడు కాణిపాకంలో జలప్రసాద కేంద్రాల ప్రారంభం

**కాణిపాకం, జూన్ 6 ప్రభాతవార్త:**

కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకసవ్వామివారి దర్శనార్థం వచ్చే భక్తుల సౌకర్యార్థం దాతల సహకారంతో ఏర్పాటు చేసిన జలప్రసాద కేంద్రాలను బుధవారం ప్రారంభించనున్నట్లు ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశులు తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన దివీస్ లేబొరేటరీస్ వారు ఆలయ వద్ద ఏర్పాటు చేసిన జలప్రసాద కేంద్రాలను స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్.బాబు బుధవారం ఉదయం 7 గంటలకు ప్రారంభించనున్నట్లు తెలిపారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## కేంద్రం దిగొచ్చే వరకు ఉక్కు పోరాటం ఆగదు

**పలమనేరు, జూన్ 6, ప్రభాతవార్త:**



కేంద్రం దిగొచ్చే వరకు విశాఖ ఉక్కు పోరాటం కొనసాగించాలని జాతీయ మానవ హక్కులు మరియు అవినీతి నిర్మూలన సంస్థ పేర్కొన్నారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో జిల్లా నాయకులు డివి మునిరత్నం మాట్లాడుతూ విశాఖపట్నం ఉక్కు ప్రైవేటీ కరణను వ్యతిరేకిస్తు, ప్రభుత్వ ఆస్తులను కాపాడుకోవాలనే సంకల్పంతో గత 850 రోజులుగా దీక్ష చేస్తుంటే కేంద్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని తెలిపారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే దేవుళ్ళని చట్టసభలో ప్రగల్బాలు పలికే పాలకులు విశాఖ విషయంలో ప్రైవేటీ కరణపై ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో రవికుమార్, గంగన్న, శారద, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

## పట్టణంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించండి

**పలమనేరు, జూన్ 6, ప్రభాతవార్త:**

పలమనేరు పట్టణంలోని పలు వీధులలో ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించాలంటు మున్సిపల్ వైస్ చైర్మన్ కిరణ్‌కుమార్, కౌన్సిలర్ నాగరాజు మున్సిపల్ కమీషనర్ కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని గంగమ్మ ఆలయం, శివాలయాలలోని రోడ్లులో దుకాణ దారులు రోడ్లపై దుకాణాలను ఏర్పాటు చేసి రోడ్డును ఆక్రమించారని తెలిపారు. దీంతో ఆలయాలు, బ్యాంకులు, పాఠశాలలకు వెళ్లేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారని తెలిపారు. దీనిపై స్పందించిన కమీషనర్ వెంటనే రోడ్లపై ఆక్రమణలు తొలగించి చర్యలు తీసుకుటామని తెలిపారు.

## రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

–పూతలపట్టు ఎమ్మెల్యే ఎం.ఎస్.బాబు

**ఐరాల, జూన్ 6 ప్రభాతవార్త:**

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వం పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్.బాబు అన్నారు. మంగళవారం మండల కేంద్రం ఐరాలలో రైతులకు రాయితీ వేరుశెనగ విత్తన కాయలను పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నట్లు తెలిపారు. ఈమేరకు ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతులు సమయానికి విత్తనాలను కొనుగోలు చేసి సబ్సిడి ధరపై రైతులకు అందిస్తున్నట్లు తెలిపారు. సబ్సిడీ వేరుశెనగ కాయలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం పలు కార్యక్రమాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ చింతం మోహన్, మండల వ్యవసాయాధికారి వరలక్ష్మీ, వైకాపా జిల్లా ప్రధాన కార్యదర్శి ధనచంద్రారెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు సురేష్‌రెడ్డి, దేవేంద్రరెడ్డి, పలువురు అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

తవణంపల్లె తహసీల్దార్‌గా చిట్టిబాబు నియామకం

తవణంపల్లె, జూన్ 6 ప్రభాతవార్త: తవణంపల్లె మండల ఇన్‌చార్జి తహసీల్దార్‌గా వై.చిట్టిబాబును నియమిస్తూ జిల్లా కలెక్టర్ సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. గత ఏడాది జూన్ నుండి మండలానికి రెగ్యులర్ తహసీల్దార్ లేకుండా ఇన్‌చార్జిలే కొనసాగుతున్నారు. ప్రస్తుతం ఐరాల తహసీల్దార్‌గా పనిచేస్తున్న సుశీల తవణంపల్లె ఇన్‌చార్జి తహసీల్దార్‌గా గత ఆగస్టు నెల నుండి కొనసాగుతున్నారు. ఈనేపథ్యంలో యాదమరి మండల తహసీల్దార్‌గా పనిచేస్తున్న వై.చిట్టిబాబును తవణంపల్లె రెగ్యులర్ తహసీల్దార్‌గా నియమిస్తూ జిల్లా కలెక్టర్ షగిలి షన్మోషన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈమేరకు మరో మూడు నాలుగు రోజుల్లో ఆయన బాధ్యతలు స్వీకరించనున్నట్లు తెలుస్తోంది.

## ద్రవిడ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

– సిఐటియు జిల్లా అధ్యక్షుడు చైతన్య

**కుప్పం, జూన్ 6 ప్రభాతవార్త**

ద్రవిడ వర్సిటీ తాత్కాలిక ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిఐటియు జిల్లా అధ్యక్షుడు చైతన్య ప్రకటనలో డిమాండ్ చేశారు. వర్సిటీలో నాలుగు నెలలవేతనాలు, 11వ పిఆర్‌పి అమలు, ఉద్యోగ భద్రతపై ఉద్యోగులు 38 రోజులుగా సమ్మె చేస్తున్నా వర్సిటీ ఉపకులపతి, రిజిస్ట్రార్‌లు చర్యలు చేపట్టకపోవడం శోచనీయమన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారంకు మాజీ సిఎం చంద్రబాబునాయుడు, ఎమ్మెల్సీ భరత్‌లు రాష్ట్ర గవర్నర్, వర్సిటీ అధికారులకు విన్నవించినా ప్రయోజనం లేకపోవడం బాధాకరమన్నారు. వర్సిటీ స్థాపన కోసం భూములిచ్చిన వారు నేడు వేతనాల కోసం రోడ్డుపై రావడం బాధాకరమన్నారు. ఇప్ప టికైనా వర్సిటీ అధికారులు స్పందించాలని కోరారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## కొత్తపట్నం పంచాయతీలో అందరికీ నీరందిస్తాం

– వర్షాలు కురిసే వరకు సహకరించండి

**కోట, జూన్ 6 ప్రభాతవార్త**

కోట మండలం కొత్తపట్నం పంచాయతీలో ప్రతి ఇంటికి మంచినీటి సరఫరా చేస్తామని ఉప సర్పంచ్ ఉప్పల ప్రసాద్‌గౌడ్ చెప్పారు. ఆయన మంగళవారం కొత్తపట్నంలో విలేఖరులతో మాట్లాడుతూ వర్షాలు కురిసే వరకు ప్రజలు కాస్త సహకరించాలని పంచాయతీ ప్రజలను కోరారు. గోవిందుపల్లి, గోవిందుపల్లిపాలెం, మిట్టపాలెం, జంగిటివానిదిబ్బ, వావిళ్లదొరువు, చినగోవిందపల్లి, కొత్తపట్నం గ్రామాల ప్రజలకు ఇప్పటివరకు పంచాయతీ ద్వారా సజావుగా మంచినీటి సరఫరా చేసినట్లు తెలిపారు. భూగర్భజలాలు అడుగంటి పోవడంతో పంచాయతీ బోర్లలో కూడా నీరు సక్రమంగా రావడం లేదన్నారు. తాగునీటిని మాత్రం ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.

## సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ముట్టడి

**కోట, జూన్ 6 ప్రభాతవార్త**

కోట, వాకాడు, చిట్టమూరు మండలాల రైతులు మంగళవారం కోట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ముట్టడించారు. భూముల విలువను 20 నుంచి 60 శాతం పెంచడాన్ని నిరసిస్తూ ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వాకాడు సొసైటీ ఛైర్మన్ కొడవలూరు భక్తవత్సలరెడ్డి మాట్లాడుతూ రైతులకు తెలియజేయకుండా ఎలా భూముల విలువలు పెంచుతారని ప్రశ్నించారు. కార్పొరేషన్, మున్సిపాలిటీ ప్రాంతాలు కాదని, మారుమూల ప్రాంతాల్లోని పంచాయతీ స్థాయిలో ఉండే భూముల విలువలు పెంచుతూ ప్రభుత్వానికి నివేదిక ఎలా పంపుతారని ఆయన ప్రశ్నించారు. పేద రైతులు ఓ బిడ్డకు పెళ్లి చేసుకోవాలన్నా, భూములు అమ్మాలన్నా, కొనాలన్నా భయపడే పరిస్థితులు ఏర్పడ్డాయని తెలిపారు. ప్రభుత్వం పునఃపరిశీలించి మార్కెట్ విలువ తగ్గించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల వైసీపీ అధ్యక్షుడు పలగాటి సంపత్‌కుమార్‌రెడ్డి, యరటపల్లి మధుసూదన్‌రెడ్డి, పుచ్చలపల్లి మాజీ జలసంఘం అధ్యక్షుడు దువ్వూరు వెంకటరమణారెడ్డి, చెందోడు సర్పంచ్ నాగూర్‌రెడ్డి, ఉపసర్పంచ్ జయచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ ఉపాధి హామీ పథకం లక్ష్యాలు నెరవేర్చాలి

**కోట, జూన్ 6 ప్రభాతవార్త**

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న లక్ష్యాలు నెరవేర్చాలని జిల్లా కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి కోరారు. మంగళవారం డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్‌తో కలిసి వర్చువల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీల హాజరు శాతం పెరగాలని, 1.25 లక్షల లక్ష్యం సాధించాలని, హార్టికల్చర్ అభివృద్ధిపై దృష్టి పెట్టాలని, వర్షాకాలం లోపు ఉపాధి హామీ పనులు లక్ష్యం మేరకు జరగాలని కోరారు. కూలీలకు సరాసరి రోజుకు రూ.270 తగ్గకుండా ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని కోరారు. ఉపాధి హామీ పనులకు కూలీల హాజరు నేటికి సుమారు లక్షమంది అని, దాన్ని లక్షా 25 వేల మందికి పెంచాలని సూచించారు. ఫీల్డ్ అసిస్టెంట్లు, సంబంధిత ఏపిఓ, అధికారులతో ఎంపిడిఓలు సమీక్షలు నిర్వహించాలని కోరారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఎంపిడిఓ, ఏపిఓ, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో డ్రైవర్‌కు గాయాలు

**దొరవారిసత్రం, జూన్ 6 ప్రభాతవార్త**

దొరవారిసత్రం మండలం అగ్రహారం, అక్కరపాక మధ్యలో లారీ బోల్తాపడింది. స్థానికుల కథనం మేరకు, మంగళవారం చెన్నై నుంచి హైదరాబాద్ వైపు ఫ్రిడ్జ్ అండ్ కూలర్స్ లోడుతో వెళుతున్న లారీ అదుపుతప్పి రోడ్డుపై బోల్తాపడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ జివిన్‌ఖాన్ స్వల్పగాయాలకు గురయ్యాడు. ఇతన్ని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. పోలీసులు స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఆరోగ్య సంజీవిని ద్వారా పోషకాహారం పంపిణీ

**గూడూరు, జూన్ 6 ప్రభాతవార్త**



గూడూరు ప్రగతి సేవాసంస్థ ఆధ్వర్యంలో ప్రతి నెలా ప్రభుత్వాసుపత్రిలో పేద ప్రజలందరూ దేవుళ్లుగా భావిస్తున్న డాక్టర్ సీఆర్‌రెడ్డి ఆరోగ్య సంజీవిని ద్వారా డాక్టర్ జనార్ధన్‌రెడ్డి, డాక్టర్ రోహిణి సహకారంతో ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు30 మందికి పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈసందర్భంగాఅధ్యక్షులుకడివేటిచంద్రశేఖర్ మాట్లాడుతూ డాక్టర్‌సిఆర్‌రెడ్డిభౌతికంగాలేకపోయినా సేవా కార్యక్రమాల రూపంలో ఆయన చిరస్మరణీయులుగా ఉంటారన్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ షేక్ షరీనా, హెడ్‌నర్స్ గౌరి, ఆసుపత్రి సిబ్బంది సాయి, మౌలాల, ప్రగతి కుటుంబ సభ్యులు శ్రీనివాసులు, రాధయ్య, ప్రభాకర్, రాము, కెఆర్ఎం కుమార్‌నాయుడు, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ సంక్షేమ పథకాలు - ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

**నాయుడుపేట, జూన్ 6 ప్రభాతవార్త**



రాష్ట్రంలో అర్హులందరికీ జగనన్న సంక్షేమ పథకాలు అందుతున్నాయని సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. మంగళవారం నాయుడుపేటలోని విన్నమాల సచివాలయం పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజీవయ్య గడప గడపకు వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగారు. ఏమైనా సమస్యలు ఉంటే చెప్పాలని, పరిష్కరిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన అందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని తెలిపారు. ప్రభుత్వ పనితీరును గమనించి ప్రతి ఒక్కరూ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించి, మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రాజేంద్ర, మున్సిపల్ ఛైర్‌పర్సన్ కటకం దీపిక, వైసీపీ మండల కన్వీనర్ తంబిరెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి, వైసీపీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కట్టా వెంకటరమణారెడ్డి, ఎంపీపీ కురుగొండ ధనలక్ష్మి, మాజీ ఎన్‌డీసీసీబీ డైరెక్టర్ కలికి మాధవరెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, ఎస్ఐ శ్రీకాంత్, మున్సిపల్ వైస్ ఛైర్మన్ వెంకటకృష్ణారెడ్డి, కౌన్సిలర్లు నాగార్జున, రవి, అశోక్, శాంతి, లక్ష్మీనారాయణరెడ్డి, నాయకులు పాదర్తి హరినాథరెడ్డి, కటకం జయరామయ్య, కామిరెడ్డి రాజారెడ్డి, బైనా మల్లికార్జునరెడ్డి, చదలవాడ కుమార్ తదితరులు ఉన్నారు.

## బీజేపీ బహిరంగ సభను విజయవంతం చేయండి

– నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ పాపారెడ్డి పురుషోత్తంరెడ్డి

**గూడూరు, జూన్ 6 ప్రభాతవార్త**



తిరుపతి జిల్లా శ్రీకాళహస్తిలో ఈ నెల 10వ తేదీన బీజేపీ జాతీయ అధ్యక్షులు జేపీ నడ్డా భారీ బహిరంగసభకు ప్రతి బీజేపీ కార్యకర్త హాజరై విజయవంతం చేయాలని గూడూరు నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ పాపారెడ్డి పురుషోత్తంరెడ్డి కోరారు. తిరుపతి జిల్లా బీజేపీ అధ్యక్షులు సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం ఉదయం గూడూరులోని ఆర్ఎస్ఎస్ కారాలయలయంలో నియోజకవర్గ కన్వీనర్ పాపారెడ్డి పురుషోత్తంరెడ్డి ఆధ్వర్యంలో అర్బన్ మండల అధ్యక్షులు అరికట్ల బాలకృష్ణనాయుడు, గూడూరు రూరల్ మండల అధ్యక్షులు వేణుగోపాల్‌రెడ్డి, చిల్లకూరు మండల అధ్యక్షులు సుబ్రహ్మణ్యం, ఆయా మండలాల కమిటీ సభ్యులు, అన్ని మోర్చాల జిల్లా, రాష్ట్ర బాధ్యులు ఉన్న బీజేపీ నేతలతో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి చిరంజీవిరెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఈ నెల 10వ తేదీన శ్రీకాళహస్తికి జాతీయ బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా వస్తున్న సందర్భంగా, ఈ సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## ప్లాస్టిక్ వాడకాన్ని నిర్మూలిద్దాం

– గూడూరు ఎమ్మెల్యే వరప్రసాదరావు

**గూడూరు, జూన్ 6 ప్రభాతవార్త**



ప్లాస్టిక్ కాలుష్యాన్ని నిర్మూలించేందుకు, మంచి భవిష్యత్తు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే వరప్రసాదరావు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక అల్లూరి ఆదిశేషారెడ్డి స్టేడియంలో క్రీడాకారులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ చిన్నతనం నుంచే ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే నష్టాల గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు. క్రికెట్, వాలీబాల్ ఆడుతున్న చిన్నారులతో, వాకింగ్ చేస్తున్న ప్రజలతో ప్లాస్టిక్ వాడకంపై అవగాహన కల్పించారు. గ్రౌండ్‌ను శుభ్రంగా ఉంచుకోవాలని, పర్యావరణాన్ని కాపాడటంతో పాటు నేటి తరాలకు ప్రకృతి ప్రసాదించిన స్వచ్ఛమైన వనరులను అందజేయాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎమ్మెల్యే అన్నారు.

## 'రాజీవ్‌నగర్' కథ కంచికేనా?

**శ్రీకాళహస్తి, జూన్ 6 ప్రభాతవార్త**

అధికార వ్యవస్థలను అడ్డుపెట్టుకుని ప్రజా సంపదను దోచుకోవడంలో ఆరితేరిన దోపిడీదారులకు కల్పతరువుగా మారిన రాజీవ్‌నగర్ అక్రమాల విచారణ కథ కంచికి చేరినట్టేనా అని తెలుగునాడు విద్యార్థి సమాఖ్య మాజీ రాష్ట్ర కార్యదర్శి మరియు బిసి వెల్ఫేర్ జెఎసి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ యం.ఉమేష్‌రావు ప్రశ్నించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గూడులేక ఇబ్బందులు పడుతున్న పట్టణ పరిధిలోని దిగువ మధ్యతరగతి మరియు పేద కుటుంబాలకు గృహ వసతి కల్పించే ఉద్దేశ్యంతో 2006-07 సంవత్సరంలో ఆనాటి ప్రభుత్వం శ్రీకాళహస్తి పట్టణానికి సుమారు 3కి.మీ దూరంలో రాజీవ్‌నగర్ పేరుతో ఏడువేలమందికి లబ్దిదారులకు సరిపడా ఇంటి స్థలాలను పంపిణీచేయడంలో కొందరు అక్రమార్కులు చేతివాటం చూపడం వాస్తవమా?కాదా? అని ఉమేష్ ప్రశ్నించారు. గత నాలుగు సంవత్సరాలుగా రాజీవ్‌నగర్ పరిసర ప్రాంతాల్లో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కావడం జోరందుకుందని ఇలా ప్రభుత్వ భూములను కబ్జా చేసిన వారిపై కనీస చర్యలు లేకపోవడం కారణంగానే అక్రమార్కులుతమదోపిడీనియదేచ్ఛగాకొనసాగిస్తున్నారనిఉమేష్‌ఆరోపించారు. దోపిడీదారుల అరికట్టించడానికి ఇంటింటి సర్వే చేయించేలా రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## 72 ఎర్రచందనం రీపర్లు స్వాధీనం

### ఐదు మంది నిందితులు అరెస్ట్ .. రెండు కార్లు, ఒక లారీ సీజ్

### డిఎస్పీ డాక్టర్ టి.డి.యశ్వంత్

**చంద్రగిరి, జూన్ 7 ప్రభాతవార్త:**



రీపర్లుగా మలుచుకుని తరలించేందుకు సిద్ధం చేసుకున్న 72 ఎర్రచందనం దుంగలను యర్రావారిపాళ్యం పోలీసులు దాడులు నిర్వహించి స్వాధీనం చేసుకున్నట్లు డిఎస్పీ డాక్టర్ టి.డి.యశ్వంత్ తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఆయన ఈ మేరకు విలేకరుల సమావేశం నిర్వహించారు. తిరుపతి జిల్లా ఎస్పీ పి.పరమేశ్వర్ రెడ్డి అందించిన రహస్య సమాచారం మేరకు.. చంద్రగిరి సబ్ డివిజన్, యర్రావారిపాళ్యం పోలీస్ స్టేషన్ పరిధిలోని బోడెవాండ్లపల్లి గ్రామ సమీపంలోని సాయికాడగుట్ట, ఆంజనేయ స్వామి వారి ఆలయం వద్ద ఎర్రచందనం అక్రమంగా దాచినట్లు ఖచ్ఛితమైన సమాచారం లభించిందన్నారు. దీంతో భాకరాపేట సిఐ ఎం.తులసీరామ్, ఎస్ఐ జి.ప్రకాష్‌కుమార్, ఎర్రావారిపాళ్యం ఎస్ఐ ఎం.వెంకటేశ్వర్లు తమ సిబ్బందితో కలసి సోమవారం సాయంత్రం దాడులు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ దాడుల్లో నాణ్యమైన 72 ఎర్రచందనం రీపర్లు, మరో నాలుగు మూటలకు కట్ చేసిన దుంగలు, ఎర్రచందనం దుంగలను రీపర్లుగా మలిచే క్రమంలో రాలిపడిన 9 మూటల పొడిని స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. ఈ క్రమంలోనే రెండు కార్లు, ఒక లారీని సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ కేసులో మొత్తం ఏడుగురు నిందితులకు గానూ 5 మందిని అరెస్ట్ చేయడం జరిగిందన్నారు. మరో ఇద్దరి కోసం గాలింపు చేపట్టినట్లు తెలిపారు. పట్టుబడిన అన్ని రకాల ఎర్రచందనం విలువ రూ.85 లక్షలు కాగా, వాహనాలతో కోటి రూపాయలు వుంటుందన్నారు. పట్టుబడిన నిందితుల వివరాలు కె.మహ్మద్ రజూల్ (52), జె.కార్తీక్ (35), మరియు భాస్కరన్ జెసురాజ్ (48), తిరుమల శెట్టి నాగరాజ (43), సి.అమరేంద్ర రాజు (45)ను రిమాండ్‌కు తరలించనున్నట్లు తెలిపారు. ఎర్రచందనం అక్రమ రవాణాను అడ్డుకున్న పోలీసులను ఆయన అభినందించారు.

## బస్సులో వ్యాపించిన మంటలు

### తృటిలో తప్పిన ఘోర ప్రమాదం

**రేణిగుంట, జూన్ 6 ప్రభాతవార్త:**



రేణిగుంట మండలం గుత్తివారిపల్లి జాతీయ రహదారిపై బస్సులో మంగళవారం సాయంత్రం మంటలు వ్యాపించాయి. డ్రైవర్ అప్రమత్తం కావడంతో ఘోర ప్రమాదం తృటిలో తప్పింది. శ్రీకాళహస్తి నుంచి తిరుత్తణి వెళుతున్న భారతి బస్సు మండలంలోని గుత్తివారిపల్లి సమీపిస్తుండగా ఇంజన్ నుంచి పొగలతో కూడిన మంటలు వ్యాపించాయి. తక్షణం స్పందించి బస్సు డ్రైవర్ బస్సును రోడ్డు పక్కన ఆపి ప్రయాణికులను దింపేశాడు. ఈ ప్రమాదంలో ఎవరికి ఎలాంటి హాని జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. డ్రైవర్ సమయ స్ఫూర్తిని మెచ్చుకుంటున్నారు.

## బాలగంగమ్మ జాతరలో విశేష అభిషేకం

తిరుమల, జూన్ 6ప్రభాతవార్తప్రతినిధి:



తిరుమలక్షేత్రంలో వెలసిన బాలగంగమ్మ ఆలయంలో మంగళవారం అమ్మవారి జాతర వైభవంగా జరిగింది. జాతర వేడుకల్లో భాగంగా ఉదయం ఆలయ అర్చకుడు దినేష్‌స్వామి సహస్రకలశాభిషేకంతో అభిషేకించారు. ఇందుకు తిరుమల బాలాజీనగర్ వాసులు ప్రతి ఒక్కరూ ఇళ్ళ వద్దనుంచి పసుపు,పువ్వులతోకూడిన పవిత్ర జలాలను తీసుకువచ్చి అమ్మవారి అభిషేకంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలగంగమ్మకు అంబళ్ళుపోసి, పాల పొంగళ్ళు పెట్టారు. గంగమ్మ దర్శనం కోసం వచ్చిన భక్తులకు అమ్మవారి తీర్థప్రసాదాలు, పసుపు,కుంకుమ, నిమ్మపండు, పసుపుదారాలు పంపిణీ చేశారు. తిరుమల స్థానికులు, భక్తులు పాల్గొన్నారు.

## ఎగ్జిక్యూటివ్ ఇంజనీరుకు సన్మానం

తిరుపతి ప్రెస్‌క్లబ్. జూన్ 6 ప్రభాతవార్త :



తిరుపతి ఓయస్‌సీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరుగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసన్‌కు మంగళవారం ఆంధ్రప్రదేశ్ విద్యుత్ కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం సభ్యులు దుశాలువతో ఘనంగా సన్మానించి, పుష్ప గుచ్చం అందజేశారు. బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఆయకు స్వాగతం పలుకుతూ శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో సంఘం అధ్యక్షులు ప్రహ్లాదయ్య, ప్రధాన కార్యదర్శి దివాకర్ రెడ్డి, తిరుపతి అధ్యక్షులు రామనాథం, నాయకులు ఉదయ్ కుమార్, హేమాద్రి, కుమార్, రాజేష్, భాను, లోకేష్, ఎస్ఇ ఆఫీస్ సభ్యులు పూర్ణ కుమార్,చిన్నరాయుడు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## కార్వేటినగరం మండలంలో 85మందికి రుణాలు

కార్వేటినగరం,జూన్ 6 ప్రభాతవార్త:



కార్వేటినగరం మండల మహిళసమాఖ్య కార్యాలయంనందుసారాయివిక్రయించు సభ్యులకు ప్రత్యామ్నాయ జీవనోపాదులపై అవగాహన కల్పించిన అనంతరం స్త్రీనిధి, బ్యాంకులింకేజి, ఎస్సీకార్పొరేషన్‌ల నుండి రుణాలు మంజూరు చేయుటకు ప్రణాళికలు సిద్దం చేసినట్లు ఎంపిడిఓ మోహన్‌మురళి తెలిపారు. మండలంలో మొత్తం 85మంది సభ్యులు హాజరుకాగా 55మంది సభ్యులకు ఆవుల రుణాలు,8మందికి మేకలు రుణాలు,11మంది సభ్యులకు గొర్రెలరుణాలు,ఇద్దరికి కిరణాషాపురుణం,9మంది సభ్యులకు ఇతర రుణాల కొరకు ముందుకు రావడం జరిగిందన్నారు. కార్యక్రమంలో డిఆర్‌డిఏ పిడి తులసి,ఎఇఎస్ ఆయేషాబేగం,ఎపిడి రవికుమార్,ఎంపిపి లతాబాలాజీ,సర్పంచ్ ధనంజయవర్మ,ఎపిఎం విజయ్‌కుమార్,ఇండియన్‌బ్యాంకు మేనేజర్,కార్పొరేషన్ ఇడి,సిసిలు పాల్గొన్నారు.

## శ్రీ వకుళమాత ఆలయంలో
## 'శాస్త్రోక్తంగా కోయిల్ అళ్వార్ తిరుమంజనం'

తిరుపతిరూరల్, జూన్06 ప్రభాతవార్త:



తిరుపతి సమీపంలోని పేరూరు బండపై వెలసిన శ్రీవకుళమాత ఆలయ మొదటి వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం కోయిల్ అళ్వార్ తిరుమంజనం నిర్వహించారు. తిరుమంజనంలో భాగంగా ఆలయాన్ని శుద్దిచేసి పసుపు, కుంకుమ, చందనం, సీకాయ, కర్పూరం, కిచిలిగడ్డ, కస్తూరి పసుపు, పచ్చాకులతో తయారు చేసిన సుగంధ మిశ్రమాన్ని గర్భాలయ గోడలకు ప్రోక్షణ చేసారు.

జూన్ 13న వార్షికోత్సవం

జూన్ 13వ తేదీన శ్రీవకుళమాత ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ఉదయం 8గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, అగ్ని ప్రతిష్ట, కలశారాధన, మహాశాంతి హోమం, పూర్ణాహుతి, అమ్మవారి ఉత్సవమూర్తులకు అష్టోత్తర శతకలశాభిషేకం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక శ్రేణి డిప్యూటీ ఈవో వరలక్ష్మీ, ఏఈవో గురుమూర్తి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శివప్రసాద్ పాల్గొన్నారు.

## నీలకంఠేశ్వరస్వామి ఆలయ జీర్ణోద్ధారణ పనుల పరిశీలన

శ్రీకాళహస్తి, జూన్ 6 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానం అనుబంధ దేవాలయమైన ఊరందూరులోని శ్రీనీలకంఠే శ్వర స్వామిఆలయజీర్ణోద్ధారణ ఆధునికీకరణ పనులు త్వరి తగతిన పనులు చేయాలని కాంట్రాక్టర్లను శ్రీకాళహస్తీ శ్వరస్వామి ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూ రుతారకశ్రీనివాసులు ఆదేశించారు. నీలకంఠే శ్వరుని వార్షిక బ్రహ్మోత్సవాల లోపు పనులు పూర్తిచేసి కుంభాభిషేకం నిర్వహిస్తామని ఛైర్మన్ తెలిపారు. ఆలయానికి మహాకుంభాభిషేకం నిర్వహించి 30ఏళ్ళు కావడంతో శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయ ఛైర్మన్ మహాకుంభాభిషేకం నిర్వహించాలని సంకల్పించారు. సుమారు రూ.30లక్షలు మంజూరు చేయించి వివిధ అభివృద్ది పనులు చేపట్టారు. మంగళవారం ఆలయ పనులను పరిశీలించి అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఆగస్టు మాసంలో నీలకంఠేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఉన్న దృష్ట్యా సత్వరం పనులు పూర్తిచేయాలని ఆదేశించారు. గర్భాలయ మరమ్మత్తులకు మర వారం రోజుల్లో బాలాలయ స్థాపన చేయడం జరుగుతుందన్నారు. పనులను పర్యవేక్షించిన వారిలో ఇంజనీరింగ్ శాఖ అధికారులు ఏఈ పవన్‌కుమార్, వర్క్ ఇన్‌స్పెక్టర్ బాలాజీ దేవస్థానం సిబ్బంది పసుపులేటి కామేశ్వరరావు, మరియు పట్టణ ప్రముఖులు బాలశెట్టినర్సింహులు, తేజ, సునీల్ మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఏరియా ఆస్పత్రిలో బాలింతలకు పండ్లు, రొట్టెలు పంపిణీ

తొట్టంబేడు, జూన్ 6 ప్రభాతవార్త



తొట్టంబేడు మండలం వైసిపి నేత శోభన్‌నాయుడు పుట్టినరోజు వేడుకలను మంగళవారం మండల పరి షత్ కార్యాలయ ఆవరణలో మండల వైకాపా కన్వీనర్ ఉన్నంవాసుదేవనాయుడు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కేక్‌కట్‌చేసి వైకాపా కన్వీనర్‌కు అందించి ఆయన వద్ద ఆశీస్సులు తీసుకు న్నారు. ఆనంతరం వాసుదేవనాయుడు మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలుచేపట్టి ప్రజలకు తానున్నానంటూ సేవ చేస్తున్నారు. పేద ప్రజల కోసం ఆయన చేస్తున్న సేవలను తెలియజేస్తూ కరోనా వచ్చిన ప్రతి వ్యక్తిని ఆయన సొంత ఖర్చులతో ఆదుకునేవారు. అనంతరం ఆయన శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రిలో ఉన్న గర్భవతులకు, బాలింతలకురొట్టెలు,పండ్లు,పాలు పంపిణీచేశారు. కార్యక్రమంలో పలువురు వైకాపా నేతలు పాల్గొన్నారు.

## నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

.తొట్టంబేడు, జూన్ 6 ప్రభాతవార్త

తొట్టంబేడు మండల పరిషత్‌సర్వసభ్య సమావేశం నేడు ఉదయం 10ః30గంటలకు జరుగుతుందని ఇన్‌ఛార్జి ఎంపిడిఓ తరుణాక్షరెడ్డి తెలిపారు. సర్వసభ్య సమావేశానికి స్థానిక ఎంఎల్‌ఏ బియ్యపుమధుసూధన్‌రెడ్డి హజరవుతారని మండల అధికారులందరు తమ తమనివేదికలతో తప్పక హజరు కావాలని సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, కో ఆప్షన్ సభ్యులు తప్పకహజరు కావాలని కోరారు.

## విద్యుత్ బస్సులకు డ్రైవర్లు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాళహస్తి, జూన్ 6 ప్రభాతవార్త

తిరుపతి ఎయిర్‌పోర్టు నుంచి తిరుమలకు ఏపిఎస్‌ఆర్టీసి విద్యుత్ ఏసి బస్సులు నడుపుటకు డ్రైవర్ల అవసరం ఉందని యూనివర్సల్ మొబిలిటీ ప్రయివేట్ లిమిటెడ్ తిరుపతి జిల్లా కోఆర్డినేటర్ భాస్కర్‌రావు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల వయస్సు 58 సంవత్సరాలు మించకూడదనీ, కనీసం 8వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని 18నెల హెవీ లైసెన్సు అనుభవం కలిగి ఉండాలని ఆయన తెలిపారు. అదేవిధంగా ఆర్టీఏ క్లియరెన్స్ సర్టిఫికెట్ కూడా పొంది ఉండాలని సూచించారు. వివరాలకు 9182576787 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

## నేడు కాణిపాకంలో సంకటహర గణపతివ్రతం

కాణిపాకం, జూన్ 6 ప్రభాతవార్త:

కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో బుధవారం సంకటహర గణపతివ్రతంను నిర్వహించనున్నట్లు ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, ఈఓ ఎ.వెంకటేశు తెలిపారు. సోమవారం ఉదయం 10 నుండి 11 గంటల వరకు, సాయంత్రం 5 గంటల నుండి 6 గంటల వరకు జరిగే ఈవ్రతంలో భక్తులు 350 రూపాయలు టిక్కెట్ చెల్లించి పాల్గొన వచ్చునని తెలిపారు.

## శ్రీ మిట్టమీద గంగమ్మ వారికి పులివర్తి సుధారెడ్డి పట్టువస్త్రసాలు



వైభవంగా ముగిసిన జాతర మహోత్సవాలు

చంద్రగిరి, జూన్ 6 ప్రభాతవార్త:

తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, టిడిపి ఎంఎల్‌ఏ అభ్యర్థి పులివర్తి నాని సతీమణి పులివర్తి సుధారెడ్డి మంగళవారం శ్రీ మిట్టమీద గంగమ్మ వారికి పట్టువస్త్రాలు సమర్పించారు. శ్రీ మిట్టమీద గంగమ్మ వారి జాతర వేడుకలను ఆలయ చైర్మన్ మొక్కల చంద్రశేఖర్ రెడ్డి అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా చివరి రోజున అమ్మవారి విశ్వరూప దర్శనం, చెంపనరకే కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించే క్రమంలో ముందుగా టవర్ క్లాక్ వద్ద గల శ్రీవరసిద్ధి వినాయక స్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు, పట్టణ ప్రజలు తరలి రాగా మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, ప్రత్యేక వాయిద్య బృందాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. ఆలయ చైర్మన్, అర్చకులు ఆమె నుండి పట్టువస్త్రాలు స్వీకరించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, దర్శన ఏర్పాట్లు గావించి, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు పల్లినేని సుబ్రమణ్యం నాయుడు, ప్రధాన కార్యదర్శి కొండూరు ప్రవీణ్ రాయల్, టిడిపి గల్లా యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు సక్కుర్ ధనంజయ రెడ్డి, టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు గౌస్ భాషా, నాయకులు ఏజి పల్లి బాల, వీరంగారి రమేష్ రెడ్డి, రఫీ, హుస్సేన్, దుబాసి రామమూర్తి, తపసి సత్యనారాయణ రెడ్డి, ఉమాపతి రెడ్డి, మండలం లోకేష్ రాయల్, రామారావు, తదితరులు పాల్గొన్నారు.

## కోట ముత్యాలమ్మ వారికి పులివర్తి సుధారెడ్డి సారె

చంద్రగిరి, జూన్ 6 ప్రభాతవార్త:



కోట గ్రామంలోని ముత్యాలమ్మ వారికి టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జ్, టిడిపి ఎంఎల్‌ఏ అభ్యర్థి పులివర్తి నాని సతీమణి పులివర్తి సుధారెడ్డి మంగళవారం సారెను సమర్పించారు. జాతర వేడుకలలో భాగంగా మంగళవారం కోట గ్రామస్థులు ముత్యాలమ్మ వారికి పొంగళ్ళు పెట్టుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త దివంగత గంగపల్లి భాస్కర్ కుటుంబ సభ్యులు, టిడిపి నాయకులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. భాణా సంఛా పేఉళ్ళు, బ్యాండు బాజాలతో ఊరేగింపుగా కోట ముత్యాలమ్మ ఆలయానికి చేరుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రామ ప్రజలు పాడిపంటలతో సుభిక్షంగా జీవించాలని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి హేమాంబరధరరావు, మండల అధ్యక్షుడు పల్లినేని సుబ్రమణ్యం నాయుడు, ప్రధాన కార్యదర్శి కొండూరు ప్రవీణ్ రాయల్, మాజీ జడ్పీటిసి వీరంగారి రమేష్ రెడ్డి, మాజీ సర్పంచ్ దుబాసి రామమూర్తి,టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు గౌస్ భాషా, మండలం లోకేష్ రాయల్, తదితరులు పాల్గొన్నారు.

## డ్వాక్రా సంఘాలను మరింత బలోపేతం చేయండి..!

డిఆర్‌డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎ.డి.జ్యోతి

చంద్రగిరి, జూన్ 56 ప్రభాతవార్త:

మండలంలో డ్వాక్రా సంఘాలను మరిన్ని ఏర్పాటు చేయడం ద్వారా బలోపేతం చేయాలని డిఆర్‌డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎ.డి.జ్యోతి అన్నారు. స్థాని స్త్రీ శక్తి భవనంలో మంగళవారం సంఘమిత్రలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదలను సంఘంలోనికి తీసుకురావడం ద్వారా ప్రభుత్వం అందించే ఫలాలను వారికి చేరవేయాలన్నారు. నిరుపేదలు సైతం ఆర్థిక స్వాలంబన సాధించడానికి డ్వాక్రా సంఘాలు దోహదపడగలవన్నారు. కౌమారదశ బాలికలు, పౌష్టికాహారలోపంతో బాధపడుతున్న పిల్లలను గుర్తించి వారికి అవగాహన కల్పించాలన్నారు. అర్హత కలిగిన ప్రతి మహిళకు పిఎంజెబివై, ఇన్సూరెన్స్‌లను చేయించాలన్నారు. పిఎంఈజిపి, పిఎంఎఫ్ఎంఈ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఏరియా కోఆర్డినేటర్ మాదవి, డిపిఎం చేయూత వనజాక్షి, ఏపిఎం ఎం.సరిత, సిసిలు సంఘమిత్రలు పాల్గొన్నారు.

## టైలరింగ్ శిక్షణతో మహిళలకు ఆర్థిక స్వాలంబన

-సి.యం.ఆర్. ఉచిత టైలరింగ్ శిక్షణలో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతిరూరల్, జూన్ 6 ప్రభాతవార్త:



టైలరింగ్ శిక్షణతో మహిళలు ఉపాధి పొందడమే కాకుండా ఆర్థికంగా ఎదగవచ్చునని చంద్రగిరి నియోజకవర్గం వైకాపా అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అన్నారు. మహర్షి అభ్యుదయ సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం లింగేశ్వర్ నగర్ నూతన సచివాలయంలో ఉచిత టైలరింగ్ శిక్షణ కార్యక్రమాన్ని చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ప్రారంభించారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సూచనల మేరకు మహర్షి అభ్యుదయ సేవా సంస్థ (మాస్) నిర్వాహణలో మహిళలకు మూడు నెలలు పాటు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. ప్రారంభోత్సవంలో మోహిత్‌రెడ్డి టైలరింగ్ చేస్తూ మహిళలను ఆకట్టుకున్నారు. అనంతరం మోహిత్‌రెడ్డి మాట్లాడుతూ మహిళలలో నైపుణ్యాన్ని పెంపోందించడంతో పాటు స్వయం ఉపాధికి ఉపయోక్తమైన టైలరింగ్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చంద్రగిరి నియోజకవర్గం వ్యాప్తంగా ఆయా గ్రామ పంచాయతీలలో ఉచిత టైలరింగ్ శిక్షణ కార్యక్రమాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాస్ అధ్యక్షుడు కె.జ్ఞానశేఖర్‌రెడ్డి, ఉప మండలాధ్యక్షుడు విడుదల మాధవరెడ్డి, లింగేశ్వర్‌నగర్ గ్రామ సర్పంచ్ ముసుగు కోటేశ్వరరావు, అవిలాల సర్పంచ్ చిందేలి వెంకటరమణ, సాయిరాయల్, తాతిరెడ్డి నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నేడు రైతులకు వేరుశనగ కాయలు పంపిణీ

తిరుపతిరూరల్, జూన్ 6 ప్రభాతవార్త:

తిరుపతిరూరల్ మండలం సి.గొల్లపల్లి రైతు భరోసా కేంద్రంలో బుధవారం రైతులకు వేరుశనగ కాయలు పంపిణి చేస్తున్నట్లు వ్యవసాయాధికారిణి మమత ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 9గంటలకు మండల ఎంపిపి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి చేతుల మీదగా రైతులకు వేరుశనగ కాయలను అందజేయనున్నారని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## వివాహంలో పాల్గొన్న గాలి భానుప్రకాష్

నగరి, జూన్ 6 ప్రభాతవార్త:



నగరి మున్సిపాలిటీ కొత్తపేటకు చెందిన ఇళన్‌గోవన్, ఢిల్లీరాణిల వివాహం జరిగింది. ఈ వివాహ రిసెప్షన్‌లో నగరి టీడీపీ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ పాల్గొని ఆ ఇద్దరిని ఆశీర్వదించారు. ఆయనతో పాటు పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## ఉత్సాహంగా కొనసాగిన క్రికెట్ ఫైనల్ మ్యాచ్

నగరి, జూన్ 6 ప్రభాతవార్త:



నగరి పట్టణంలో కేవీకే మైదానం వేదికగా రోజా చారిటబుల్ ట్రస్టు ద్వారా నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నీ ఫైనల్ మ్యాచ్ మంగళవారం ఉత్సాహభరితంగా కొనసాగింది. క్రీడాకారులు తమ బ్యాటింగ్ నైపుణ్యాలను ప్రదర్శిస్తూ చూడచక్కటి షాట్లతో అలరిస్తుండగా ప్రత్యర్థి జట్లను తక్కువ స్కోరుకే అవుటు చేయడంతోపాటు పరుగులు తీయకుండా ఉండేలా బౌలర్లు శ్రమించారు. దీంతో ఫైనల్ మ్యాచ్ ఆద్యంతం ఆసక్తికరంగా కొనసాగింది. అండర్ 14లో గోదావరి, కృష్ణా టీంల మధ్య జరిగిన ఫైనల్ నిర్వహించగా ఒక్క పరుగుతో గోదావరి టీం విజయం సాధించింది. 30 ఓవర్ల నిర్ణీత మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన గోదావరి జట్టు 25 ఓవర్లలో 7 వికెట్లుకోల్పోయి 189 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ దిగిన కృష్ణా జట్టు 29.4 ఓవర్లలో 156 పరుగులు చేసి అలౌట్ అయింది. దీంతో 33 పరుగుల తేడాతో గోదావరి జట్టు విజయం సాధించింది. అండర్ 16 విభాగంలో గంగా, యమున జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ నిర్వహించగా తొలుత బ్యాటింగ్ చేసిన యమునా జట్టు 25 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 204 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన గంట జట్టు 159 పరుగులకు అలౌట్ అయింది. దీంతో 45 పరుగుల తేడాతో యమున జట్టు విజేతగా నిలిచింది. విజేతలకు బుధవారం ట్రోఫీలు అందించనున్నట్లు శాప్‌కోచ్ బాబు తెలిపారు.

## పునఃప్రారంభానికి పాఠశాలలు సిద్ధం కావాలి

నగరి, జూన్ 6 ప్రభాతవార్త:

ఈ నెల 12వ తేదీ పాఠశాలలు పునఃప్రారంభిస్తున్నామని అప్పటి లోగా నాడు-నేడు పనులు పూర్తి చేసి పాఠశాలలు సిద్ధంగా ఉండాలని ఎంఈవో శ్రీదేవి అన్నారు. మంగళవారం నాడు-నేడు ఫేజ్ 1, ఫేజ్ 2 పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ నాడు-నేడు ఫేజ్ 2 పాఠశాలల్లో టాయిలెట్‌లు, తరగతి గదులు మరమ్మతులు పూర్తి చేయాలని, తరగతి గదిలో అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. ప్రభుత్వం సూచించిన విద్యుత్ సామగ్రినే స్థానికంగా కొనుగోలు చేసుకోవాలన్నారు. 218, ఆగస్టు 31వ తేదీకి ముందు పుట్టిన పిల్లలకు 1వ తరగతిలో అడ్మిషన్ చేయించుకోవాలన్నారు. జగనన్న విద్యా కానుక కిట్లు ఆయా పాఠశాలల వద్దకే అందిస్తున్నామన్నారు.

## మండల సర్వసభ్య సమావేశం

రేణిగుంట, జూన్ 6 ప్రభాతవార్త:



రేణిగుంట ఎంపీడీవో కార్యాలయ సమావేశ భవనంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి అధ్యక్షతన ఎంపీడీవో హరిబాబు పర్యవేక్షణలో జరిగింది. సమావేశంలో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పంచాయతీల కార్యదర్శులు పాల్గొని వివిధ సమస్యలను సభ దృష్టికి తెచ్చారు. ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి సమస్యలను సంబంధిత శాఖల అధికారుల ద్వారా పరిష్కార మార్గాలు సూచించారు. సమావేశంలో జడ్పీటీసీ సంధ్యారాణి, తహసీల్దార్ శివప్రసాద్, ఎంపీడీవో హరిబాబు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## ప్రమాదకర మలుపుల్లో బస్సులను అప్రమత్తంగా నడపాలి

-విద్యుత్ బస్సు డ్రైవర్లకు డిప్యూటీ సిటిఎం సూచన

తిరుపతి ప్రెస్‌క్లబ్,జూన్ 6 ప్రభాతవార్త:



తిరుమల మొదటి,రెండవ కనుమ రహదారుల్లో బస్సులను నడిపేటప్పుడు అతి జాగ్రత్తగా,అప్రమత్తంగా నడపాలని ఆర్టీసీ డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ ఎం.భాస్కర్ విద్యుత్ బస్సుల డ్రైవర్లకు సూచించారు.గత కొన్ని రోజులుగా తిరుమల కనుమ రహదారుల్లో వరుసగా వివిధ రకాల వాహనాలు ప్రమాదానికి గురవుతున్నాయి.ఇందులో తాజాగా ఆర్టీసీకి చెందిన విద్యుత్ బస్సు తొలిసారిగా ప్రమాదానికి గురైన విషయాన్ని తీవ్రంగా పరిగణించిన అధికారులు మంగళవారం స్థానిక జిల్లా ప్రజా రవాణా అధికారి వారి కార్యాలయం నందు విద్యుత్ బస్సు డ్రైవర్లకు ప్రమాద రహిత డ్రైవింగ్‌పై రిఫ్రెష్‌మెంట్ ట్రైనింగ్ ఇచ్చారు.ఈ సందర్భంగా డ్రైవర్లను ఉద్దేశించి డిప్యూటీ సిటిఎం మాట్లాడుతూ తిరుపతి నుండి తిరుమలకు 28 నిమిషాల ప్రయాణ సమయం,అలాగే తిరుమల నుండి తిరుపతికి 40 నిమిషాల ప్రయాణ సమయం ఖచ్చితంగా పాటించాలన్నారు.ముందు వెళ్ల వాహనాలను ఎట్టి పరిస్థితుల్లోనూ అధికమించరాదని,సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదన్నారు.ఘాట్ రోడ్లలో నిర్దేశించిన ప్రదేశాలలో మాత్రమే వాహనాలను నిలపాలన్నారు.తిరుపతి నుండి తిరుమల వెళ్లేటప్పుడు ప్రమాదకర మలుపులలో అతి జాగ్రత్తగా బస్సులు నడిపి ప్రయాణీకులకు సురక్షితమైన ప్రయాణాన్ని అందించి,తద్వారాసంస్థఅభివృద్ధికితోడ్పడాలనికోరారు.పర్సనల్ ఆఫీసర్ ఎం.పార్థసారథి,తిరుపతి, అలిపిరి డిపో మేనేజర్లు టి.బాలాజి,ఎస్.రాజేంద్రప్రసాద్,తదితరులు పాల్గొన్నారు.

## మల్టి లెవల్ కార్ పార్కింగ్ పనులపై శ్రద్ధ పెట్టండి



కమిషనర్ హరిత

తిరుపతి కార్పొరేషన్, జూన్ 6, ప్రభాతవార్త

తిరుపతి ప్రజలకు, పుణ్యక్షేత్రానికి వస్తున్న యాత్రికులకు అనుకూలంగా వుండేలా నిర్మిస్తున్న మల్టి లెవల్ కార్ పార్కింగ్ ప్రాజెక్ట్‌ను వేగవంతం చేయాలని తిరుపతి నగర పాలక సంస్థ కమిషనర్ హరిత అన్నారు. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రైల్వే స్టేషన్ ముందర టిపి ఏరియాలో నిర్మిస్తున్న మల్టి లెవల్ కార్ పార్కింగ్ నిర్మాణ పనులను మంగళవారం కమిషనర్ హరిత పరిశీలించి అధికారులకు, నిర్మాణ సంస్థ కాంట్రాక్టర్లకు తగు సూచనలు చేసారు. ఈ సందర్భంగా కమిషనర్ హరిత మాట్లాడుతూ 50 కోట్ల స్మార్ట్ సిటీ నిధులతో ఇక్కడ నిర్మిస్తున్న మల్టీ లెవల్ కార్ పార్కింగ్ స్థలంలో సెల్లార్, జీ ప్లస్ 7 అంతస్థులతో మల్టి లెవల్ కార్ పార్కింగ్ నిర్మించడం జరుగుతుందన్నారు. ఇందులో క్రిందనున్న సెల్లార్లో 160 ద్విచక్ర వాహనాలను పార్కింగ్ చేసుకునేలా డిజైన్ చేయడం జరిగిందని, అదే విధంగా 1,2 అంతస్థుల్లో రెస్టారెంట్లు, కమర్షియల్ షాపులు వుంటాయని 3,4 అంతస్థుల్లో మల్టిప్లెక్స్ థియేటర్లు వుంటాయని, 5,6,7 అంతస్థుల్లో 240 కార్లు పార్కింగ్ చేసుకునేలా, ఆ వాహనాలను పైకి తీసుకెల్లేందుకు ఆరు లిఫ్టులను నిర్మించడం జరుగుతుందన్నారు. తిరుపతి నగరంలోకి వచ్చే యాత్రీకులకు, ఇక్కడున్న ప్రజలకి ఈ మల్లి లెవన్ కార్ పార్కింగ్ రావడం వలన ఎంతో ఉపయోగకరంగ వుంటుందని కమిషనర్ హరిత తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీర్ చంద్రశేఖర్, నిర్మాణ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

## 11న జీ తెలుగులో చార్లీ 777

తిరుపతి,జూన్ 6ప్రభాతవార్త:




తెలుగుప్రేక్షకులకు అంతులేని వినోదాన్ని అందిస్తున్న జీతెలుగులో ఆదివారం మరింత వినోదం అందించేందుకు ఫన్ ఎమోషనల్ డ్రామా చార్లీ 777 వరల్డ్‌ప్రీమియర్‌గా ప్రసారం కానుంది. థియేటర్లలో విడుదలై ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్న ఈ డ్రామా జీతెలుగుప్రేక్షకులకు 11వతేదీ ఆదివారం రాత్రి 9గంటలకు ప్రసారం కానుంది. చిన్నపిల్లల్లోని టాలెంట్‌ను ప్రోత్సహిస్తూ వారి భవిష్యత్తుకు బాటలు చూపే విజయవంతమైన రియాలిటీ షో డ్రామా జూనియర్స్.తెలుగుచిత్ర నటీనటులు జయప్రద, బాబూమోహన్.శ్రీదేవి విజయకుమార్ ఈ షోకు న్యాయనిర్ణేతలుగా వ్యవహరిస్తారు.ప్రేక్షకుల హృదయాన్ని చార్లీ 777 వినోదంగామారుస్తుంది. 11న సాయంత్రం 5.30గంటలకు ప్రారంభమవుతుంది. హాస్యనటుడు బాబూమోహన్, నటి శ్రీదేవి సలహాలు పిల్లలను ఉత్సాహాన్ని అందిస్తాయి.

## ప్రజలకు సౌకర్యంగా వందఅడుగుల రోడ్లు ఏవీ!?

-ఉపయోగంచోట 40అడుగుల రోడ్డేశారంటూ టిడిపి నిరసన

తిరుపతి,జూన్ 6ప్రభాతవార్త:



తిరుపతి నగరాన్ని అభివృద్ధిచేస్తున్నామంటూ గొప్పలు చెబుతున్న తిరుపతి నగరపాలక కౌన్సిల్ ప్రజలకు అవసరం లేని చోట్ల 100 అడుగుల రోడ్డును నిర్మించి, ప్రజలకు ఉపయోగం ఉన్నచోట 40అడుగుల రోడ్డుతో సరిపెట్టేసుకోవడం దేనికి అర్థమని టిడిపి ఇన్‌చార్జి సుగుణమ్మ విమర్శించారు. కార్పొరేషన్‌లో మేయర్, ఉపమేయర్, కార్పొరేటర్లు నగరంలో, శివార్లలో అభివృద్ధి అంటున్నారని, మాస్టర్‌ప్లాన్ రోడ్లతో ఎవరికి ఉపయోగమని ప్రశ్నించారు. అభివృద్ధిపేరుతో తిరుపతి ప్రజలను దగా చేస్తున్నారని మండిపడ్డారు. మంగళవారం ఉదయం టిడిపి నేతలు కార్పొరేటర్ ఆర్‌సి మునికృష్ణ, మహేష్‌యాదవ్, మునిశేఖర్ రాయల్, ఊట్లసురేంద్రనాయుడు, వెంకటరత్నం, కుమారమ్మ ,నరేష్, పూర్ణరెడ్డి, ఎస్‌వీఎం శ్రీధర్ తదితరులతో కలసి సుగుణమ్మ మంగళం మార్గంలో ఆనంచెంచిరెడ్డి లేఔట్‌ను పరిశీలించారు. ఇక్కడ ఉన్నటువంటి 40అడుగుల రోడ్డుతో ఎవరికి ఉపయోగమన్నారు.

## మద్యం విక్రయాల్లో పొరపాట్లు చేయకండి

డిపో సబ్‌ఇన్స్‌పెక్టర్ రామకృష్ణ

కార్వేటినగరం,జూన్ 6 ప్రభాతవార్త:



ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న సిబ్బంది మద్యం స్టాక్,అమ్మకాల నగదు విషయంలో ఎలాంటి పొరపాట్లు చేయరాదని చిత్తూరు మద్యం డిపో సబ్‌ఇన్స్‌పెక్టర్ రామకృష్ణశాస్త్రి సూపర్‌వైజర్‌లను హెచ్చరించారు. చిత్తూరు ప్రొహిబిషన్,ఎక్సైజ్ సూపర్‌డెంట్ దయాసాగర్,డిపో ఇన్‌స్పెక్టర్ లక్ష్మణరావు ఆదేశాల మేరకు మంగళవారం కార్వేటినగరం మండలంలో గల వివిధ ప్రభుత్వ మద్యం దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సంధర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడుతూ కొద్దిమంది సిబ్బంది పొరపాట్లు చేయడం వల్ల వారి భవిష్యత్తు పాడుచేసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. ఈ తనిఖీలలో విడిమద్యం,కల్తీమద్యంపై కూడా ప్రత్యేక నిఘా ఉంచినట్లు ఆయన చెప్పారు. ఆన్‌లైన్ ఆప్ ద్వారా నిల్వగల స్టాకును సిబ్బంది సహాయంతో నిశితంగా పరిశీలించారు. ఈ తనిఖీలలో ఆయన వెంట వెరిఫికేషన్ ఆఫీసర్లు నాగరాజు,జాన్సన్,సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

## వెదురుకుప్పం ఎస్సై లోకేష్‌ను సస్పెండ్ చేయాలి

అధికార ప్రతినిధి నేత ఈశ్వర్

కార్వేటినగరం,జూన్ 6 ప్రభాతవార్త:



గంగాధరనెల్లూరు నియోజకవర్గ పరిధిలో వెదురుకుప్పం మండలం తూర్పుదళితవాడకు చెందిన రామూర్తి అనే దళితయువకుడిని పోలీసుస్టేషన్‌లో బంధించి చిత్రహింసలకు గురిచేసి లాఠీలతో శరీరభాగాలపై విచక్షణారహితంగా శరీరభాగాలు కమిలిపోయే విధంగా చితకకొట్టిన వెదురుకుప్పం ఎస్సై లోకేష్‌ను సస్పెండ్‌చేయాలని రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధికార ప్రతినిధి ఈశ్వర్ నేత డిమాండు చేశారు. ఎస్సైపై ఎస్సీ,ఎస్టీ కేసు నమోదు చేయాలని,విలేకరులపై తప్పుడుకేసులు నమోదు చేసి విలేకరులపై ప్రతాపం చూపినప్పుడే ప్రభుత్వం,స్థానిక ప్రజాప్రతినిధులు అతనిపై చర్యలు తీసుకొని వుంటే పరిస్థితి ఇందాక వచ్చేదికాదన్నారు. మనం ప్రజాస్వామ్యంలో జీవిస్తున్నామని,దేశప్రదానియైన,దేశ ప్రథమపౌరుడు రాష్ట్రపతియైన రాజ్యాంగానికి లోబడి ప్రజలకు సేవ చేయాలన్నారు. ప్రజల పన్నులను జీతాలుగా తీసుకుంటూ విలేకరులపై,దళితయువకులపై ఈ విధంగా ప్రవర్తించడం ఒకస్థాయిలో ఉన్న,హోదాలో ఉన్న వెదురుకుప్పం ఎస్సైకి తగదన్నారు. ఇలాంటి పరిస్థితులుపునరావృత్తంకాకుండా జిల్లా ఎస్పీ జరిగిన సంఘటనలపై ఆరా తీసి చర్యలు తీసుకోవాలని కోరారు.

## కార్వేటినగరం గ్రామదేవతకు ప్రత్యేకపూజలు

కార్వేటినగరం,జూన్ 6 ప్రభాతవార్త:



కార్వేటినగరం గ్రామదేవతయిన బంగారమ్మ ఆలయంలో మంగళవారం ప్రత్యేకపూజలు నిర్వహించారు. అమ్మవారికి తెల్లవారిజామున పాలు, పెరుగు,చందనం,పసుపు,కుంకుమ, నారికేళం,బంగారునీళ్ళు ,తేనెలతో అబిషేకాలు నిర్వహించారు. పట్టువస్త్రాలు,ఆభరణాలు,పువ్వులతో బంగారమ్మను అలంకరించారు. ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. అమ్మవారిని అధికసంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు అంబళ్ళు,తీర్థప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఆలయఅధ్యక్షులు కొప్పేటిప్రసాద్,ఉపాధ్యక్షులు రంగనాధమొదలియార్,కమిటిసభ్యులు,భక్తులు పాల్గొన్నారు.

## అమ్మవారి సేవలో పీసీసీ సభ్యులు పోటూగారి భాస్కర్

వెదురుకుప్పం, జూన్ 6 ప్రభాతవార్త :

ద్రౌపది అమ్మవారి సేవలో మంగళవారం పీసీసీ సభ్యులు పోటూగారి భాస్కర్ పాల్గొన్నారు. ఆలయ ధర్మకర్త మండలి సభ్యులు ఆయనకు స్వాగతం పలికి అమ్మవారి దర్శన భాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. అమ్మవారిని దర్శనం చేసుకున్న అనంతరం పోటూగారి భాస్కర్ ఆలయంలో జరుగుతున్న వార్షిక ఉత్సవాల కొరకు కానుకలు బహుకరించారు.ఆలయ మర్యాద ప్రకారం వారిని దుశాలువతో సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ఉమాపతి రెడ్డి, ఆలయ కార్యనిర్వహసభ్యులు కొండా రెడ్డి, కృష్ణా రెడ్డి, ఆంజనేయులు రెడ్డి, ఆనంద రెడ్డి, బట్టే సుబ్రమణ్యం, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు హుమేష్, నాయకులు సుబ్రమణ్యం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





















# సూర్య, చంద్రప్రభ వాహనాలపై కల్యాణ వేంకటేశ్వరుడు





నారాయణవనం, జూన్ 6 ప్రభాతవార్త :

ప్రసిద్ధి పుణ్యక్షేత్రంగా వెలసిన నారాయణవనంలోని పద్మావతీదేవి సమేత కల్యాణ వే ంకటేశ్వరుని వార్షిక బ్రహ్మోత్సవాలకు సంబందించి కల్యాణ వేంకటేశ్వరుడు ఏడవ రోజు మంగళవారం ఉదయం 8:00ను ంచి 9:30గంటల మద్య సూర్యప్రభ వాహనాన్ని అధిరోహించి నగరవీధుల్లో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. రాత్రి 7గంటలకు కల్యాణ వేంకటేశ్వరున్ని చంద్రప్రభవాహనంపై అధిరోహించి మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ భక్తులకు దర్శనం భాగ్యం కల్పించారు. భక్తులు అడుగడుగునా టెంకాయహారతులు, నైవేద్యం సమర్పించుకున్నారు. అంతకు ముందు ఉదయం ఆలయంలో సుప్రభాత సేవతో శ్రీవారిని మేల్కొల్పారు. తర్వాత నిత్యకట్ల, మొదటి గంట, బేరితాండనము, తోమాలసేవ, శుద్ధి, నిర్వహించారు. అనంతరం సూర్యప్రభ వాహనంపై అధిరోహించి మాడవీధి, మెయిన్‌రోడ్డు, కొత్తబజారువీధి, పాత బజారువీధి, ఎగువ, దిగువపద్మాశాలీ వీధి, తేరువీధుల్లో ఊరేగిన తర్వాత కల్యాణ వేంకటేశ్వరునికి ఘనంగా స్నపనతిరుమంజనం నిర్వహించారు. పాలు, పెరుగు, నెయ్యి, కొబ్బరినీళ్లు, పశుపు వంటి సుగంధద్రవ్యాలతో స్నపనతిరుమంజనం చేయడం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. సాయంత్రం 6 గంటల నుంచి గంటపాటు ఊంజల్ మండపంలో ఊంజల్‌సేవను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నమయ్య సంకీర్తలను వినిపించారు. భక్తులు వేలాదిగా తరలివచ్చి శ్రీవారి సేవలో పాల్గొని తరించారు. రాత్రి 7గంటలకు శ్రీవారు చంద్రప్రభ వాహనాన్ని అధిరోహించి నగరు వీధుల్లో ఊరేగారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, కోలాటం, చెక్కభజనల నడుమ శ్రీవారు భక్తులకు అభయమిచ్చారు. అందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీఇఒ నాగరత్న, ఎఇఒ మోహన్, సూపర్‌టెండెంట్ ఏకాంబరం, ఆలయ పర్యవేక్షకులు నాగరాజు, ఆర్జితంఇన్స్‌పెక్టర్ భరత్, సివిల్ ఇంజనీర్ గురుప్రసాద్, నారాయణవనం సర్పంచ్ కెజి శారదమ్మ గణేషన్, అర్చకులు శ్రీధర్ భట్టాచార్య, నరసింహరాఘవ భట్టాచార్య, శ్రీనివాస భట్టాచార్య, వివిధ శాఖలకు చెందిన టిటిడి అధికారులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

## నేడు రథోత్సవం

# తహసిల్లార్ల బదిలీలు

చిత్తూరు, జూన్ 6 ప్రభాతవార్త: జిల్లాలో ఐదు మంది తహసిల్దార్లను బదిలీ చేస్తూ కలెక్టర్ సగిలి షన్మోహన్ ఉత్తర్వులు జారీ చేశారు. జిడినెల్లూరు తహసిల్దారుగా విధులు నిర్వహిస్తున్న ఆర్.ఇన్బనాధన్‌ను పాలసముద్రం తహసిల్దారుగా, పాలసముద్రం తహసిల్దారుగా విధులు నిర్వహిస్తున్న బాబును జిడినెల్లూరు తహసిల్దారుగా, యాదమరి తహసిల్దారుగా విధులు నిర్వహిస్తున్న వై.చిట్టిబాబును తవణంపల్లి తహసిల్దారుగా, పెద్దపంజాణి తహసిల్దారుగా విధులు నిర్వహిస్తున్న బి.హనుమంతును యాదమరి తహసిల్దారుగా, శాంతిపురం తహసిల్దారుగా విధులు నిర్వహిస్తున్న డి.లోకేశ్వర్‌రావును పెద్దపంజాణి తహసిల్దారుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.


















# ఉపాధి హామీ పథకం లక్ష్యాలను సాధించాలి

## ఉద్యాన పంటలు లక్ష్యాల మేరకు సాధించేలా చర్యలు చేపట్టాలి: కలెక్టర్ వెంకటరమణ రెడ్డి



తిరుపతి కలెక్టరేట్, జూన్ 6, ప్రభాతవార్త

మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న కార్యక్రమాలపై సంబంధిత అధికారులు ఎంపిడిఓలు, సహాయ పథక సంచాలకులు, సహాయ ప్రాజెక్టు అధికారులతో, పతక సంచాలకులు డ్వామా శ్రీనివాస ప్రసాద్‌తో కలిసి వర్చువల్ విధానంలో జిల్లా కలెక్టర్ వెంకటరమణ రెడ్డి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీల హాజరు శాతం పెరగాలని జూన్ నెల 1.25 లక్షల లక్ష్యం సాధించాలని, హార్టికల్చర్ అభివృద్ధి పై దృష్టి పెట్టాలని వర్షాకాలంలోపు ఉపాధి హామీ పనులు లక్ష్యం మేరకు జరిగేలా వేగవంతం చేయాలని సరాసరి కూలీ రూ. 272కు తగ్గకుండా ప్రణాళికా బద్ధంగా పని చేయాలని ఆదేశించారు. మంగళవారం ఉదయం స్థానిక కలెక్టరేట్ ఛాంబర్లో వర్చువల్ విధానంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో సంబంధిత అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఉపాధి హామీ పనులతో కూలీల హాజరు నేటికి సుమారు లక్ష ఉందని, దానిని 1.25 లక్షలకు ఈ వారమైనా సాధించాలని, పని దినాలు పెరగాలని అన్నారు. ఆ దిశగా ఎంపిడిఓలు పురోగతి సాధించేలా, గ్రామ పంచాయితీ వారీగా ఫీల్డ్ అసిస్టెంట్లు, సంబంధిత ఏపిఓ తదితర అధికారులతో సమీక్షించుకుని ప్రణాళికా బద్ధంగా పని చేసి పురోగతి సాధించాలని అన్నారు. హార్టికల్చర్ పనులపై దృష్టి పెట్టి ప్రతి మండలంలోని అధికారులు వారికి నిర్దేశించిన లక్ష్యాలను అందిపుచ్చుకోవాలని ఆదేశించారు. అంతే కాకుండా ఎస్సి, ఎస్టీ కుటుంబాలు కూడా నిబంధనల మేరకు కవర్ అయ్యేలా గ్రామ పంచాయితీ వారీగా గుర్తించి వారికి పనులు కల్పించి పని దీనాలు మెరుగ్గా కల్పించాలని అన్నారు. చిన్న గొట్టికల్లు, చంద్రగిరి, వెంకటగిరి, శ్రీకాళహస్తి, తొట్టంబేడు, తడ పాకాల, చిట్టమూరు, పెళ్లకూరు, బిఎన్ కండ్రిగ, వాకాడు మండలాలు ఉపాధి హామీ, హార్టికల్చర్ పురోగతిలో తక్కువ ఉన్నారని, పనితీరు మెరుగుపడాలని తెలిపారు. ఉద్యాన పంటలు వేసుకునే వారికి త్వరిత గతిన ఏపీఎంఐపి ద్వారా డ్రిప్ మంజూరు చేయడం జరుగుతుందని రైతులను ఉద్యాన పంటలు వేసేలా ప్రోత్సహించాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లాలోని అన్ని మండలాల ఎంపిడిఓలు, ఏపివో, ఏపిడిలు తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా శ్రీకరిమాణిక్యస్వామి రథోత్సవం



నాయుడుపేట, జూన్ 6 ప్రభాతవార్త

నాయుడుపేట పట్టణంలోని తుమ్మూరులో వెలసి ఉన్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీకరిమాణిక్యస్వామి ఆలయంలో తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో వార్షిక బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం శ్రీ కరిమాణిక్యస్వామికి వైభవంగా రథోత్సవం నిర్వహించారు. శ్రీదేవి భూదేవి అమ్మవార్లను, శ్రీవారిని విశేషంగా అలంకరించి రథోత్సవం నిర్వహించారు. ఈ రథోత్సవంలో అశేష జనవాహిని పాల్గొన్నారు. రథోత్సవంలో శ్రీవారు అమ్మవార్లపై మిరియాలు చల్లితే తమ కోరికలు నెరవేరుతాయని భక్తుల విశ్వాసం. దీంతో అనేకమంది భక్తులు మిరియాలు విరివిగా చల్లి మొక్కులు తీర్చుకున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో రథోత్సవం నిర్వహించడం ప్రాముఖ్యత సంతరించుకుంది.

# అందరినీ చల్లగా చూడమ్మా!

## మూడవవారం వేషాలు వేసి గంగమ్మకు కళాకారుల మొక్కులు



తిరుపతి, జూన్ 6ప్రభాతవార్త:

తిరుపతి తాతయ్యగుంటగంగమ్మ జాతర ముగిసిన మూడవ మంగళవారం రాయలసీమ రంగస్థలి కళాసంస్థ ఛైర్మన్ గుండాల గోపీనాధరెడ్డి ఆధ్వర్యంలో కళాకారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రంగస్థలికళాకారులు వరుసగా జాతరనుంచి ప్రతి మంగళవారం పలురకాల వేషధారణలతో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటున్నారు. అందరినీ చల్లగాచూడాలని, సకాలంలో వర్షాలు కురవాలని వేడుకున్నారు. రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీనాధరెడ్డి ,కళాకారులు పొన్నాల జేజిరెడ్డి, చంద్రబాబునాయుడు, టి.సుబ్రమణ్యంరెడ్డి, ముని, కేశవులురెడ్డి, హేమంత్ ,గంగయ్య వేషాలు వేసి గంగమ్మను మొక్కారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో రంగస్థలి కళాకారులు కెఎన్ రాజా, రాజశేఖర్, కోదండపాణి, భక్తులు పాల్గోన్నారు.

# పర్యావరణ హిత బట్ట బ్యాగులను ప్రోత్సహించాలి

## రైతుబజార్లో క్లాత్‌బ్యాగ్‌లు యంత్రాన్ని ప్రారంభించిన కలెక్టర్ వెంకటరమణారెడ్డి



తిరుపతిరూరల్, జూన్ 6 ప్రభాతవార్త:

ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి, పర్యావరణహిత బట్టతో తయారు చేసిన చేతి సంచుల వాడకాన్ని ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ వెంకట రమణారెడ్డి అన్నారు. మంగళవారం తిరుపతి రైతు బజారులో కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్లాత్ బ్యాగ్‌ల వెండింగ్ యంత్రాన్ని కలెక్టర్ ప్రారంభించారు. రైతుబజార్లో కూరగాయాలు, నిత్యవసర సరుకులు కొనుగోలుకు వచ్చే ప్రజలకు ప్లాస్టిక్ కవర్లు బ్యాగులు వాడకుండా బట్ట బ్యాగులను వాడేలా, 20 రుపాయాలు విలువ చేసే బట్ట సంచిని అతి తక్కువ ధరలో కేవలం రూ.10వేల రుపాయాలకే అందిస్తున్నట్లు తెలిపారు. యంత్రంలో రు.10 నోటు గానీ, 2 ఐదు రుపాయాల నాణ్యాలు వేయడం ద్వారా బట్ట బ్యాగు వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలుష్యనియంత్రణ మండలి ఈఈ నరేంద్రబాబు, ఏఇ మదన్‌మోహన్, సరేంద్ర, ఏస్టేట్ అధికారి అక్తర్ షరీప్ తదితరులు పాల్గొన్నారు.

# భూ హక్కు రీసర్వే వేగవంతం కొరకు ట్యాబులు పంపిణీ

## కమిషనర్ హరిత



తిరుపతి కార్పొరేషన్, జూన్ 6, ప్రభాతవార్త

వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం సమగ్ర రీ సర్వే వేగవంతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నుండి వచ్చిన మన తిరుపతిలోని 102 సచివాలయాలకు శ్యామ్ సంగ్ గ్యాలక్సి ట్యాబులను అందించడం జరిగిందని తిరుపతి నగర పాలక సంస్థ కమిషనర్ హరిత తెలిపారు. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో మంగళవారం ట్యాబులను పంపిణీ చేసిన అనంతరం కమిషనర్ హరిత మాట్లాడుతూ తిరుపతి నగరంలో ఇప్పటికే డ్రోన్ సర్వే పూర్తి చేయడం జరిగిందని, తిరుపతి కార్పొరేషన్ పరిధి 27 స్క్వైర్ కిలో మీటర్లు, 1800 ఎకరాల్లో, 5 రెవెన్యూ విలేజెస్‌లో కవర్ అయిందని తెలిపారు. రీసర్వే ప్రకియలో వార్డు సచివాలయ సిబ్బంది, ముఖ్యంగా అడ్మిన్ సెక్రటరీలు, ప్లానింగ్ సెక్రటరీలు, విఆర్ఓలు అందరూ కూడా వాళ్ళ సచివాలయ పరిధిలో ఎన్ని సర్వే నంబర్లు ఉన్నాయి. ఎంత ఏరియా ఉంది, ఎన్ని ప్రాపర్టీ టాక్స్ అసిస్టెంట్‌లు ఉన్నాయనే డేటా ఎంట్రీ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం జరిగిందన్నారు. ఇటీవలే మనకు డ్రోన్ సర్వే పూర్తి చేసుకున్న నేపథ్యంలో ఇకనుండి ఫీల్డ్ వెళ్లి అక్కడ డేటా తీసుకున్న తర్వాత మళ్లీ సచివాలయానికి వచ్చి కంప్యూటర్‌లో ఎంటర్ చేయకుండా ఎక్కడికి అక్కడే ఆన్‌లైన్ డేటా ఎంట్రీ జరగాలనే ఉద్దేశంతో ప్రభుత్వం వీటిని పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఆర్తో రెక్టిఫైడ్ ఇమేజ్ వచ్చిన వెంటనే రీ సర్వేని వేగవంతం చేయడానికి నగరపాలక సిబ్బంది, అలాగే సచివాలయ సిబ్బంది అందరూ కూడా కృషి చేయడం జరుగుతుందని తిరుపతి నగర పాలక సంస్థ కమిషనర్ హరిత తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ సునీత, డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర రెడ్డి, రెవెన్యూ అధికారి సేతు మాధవ్, ప్లానింగ్ అధికారులు శ్రీనివాసులు రెడ్డి, బాలసుబ్రమణ్యం, సూపరింటెండెంట్ హాసిమ్, రవి, ప్లానింగ్ సిబ్బంది సాయిలీలా, శారధాంబా, జగదీష్ రెడ్డి పాల్గొన్నారు.

